# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-03-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. వేసవిలో ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది.**

**2. ఉద్యోగ భవిష్య నిధి – ఈపీఎఫ్ చందాదారుల వ్యక్తిగత వివరాల నమోదులో దొర్లిన పొరపాట్లను సరిచేసేందుకు సమర్పించాల్సిన ఆధారాల్లో స్వల్పమార్పులు చేసింది.**

**3. ఆంధ్రప్రదేశ్‌లోని పలు నియోజకవర్గాలకు చెందిన 51 మందిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలనిచ్చింది.**

**4. క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు పలు అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు.**

**5. తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల తెప్పోత్సవాలు ఈరోజుతో ముగుస్తాయి.**

===========================

వేసవిలో ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు.. కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు ముప్పుగా మారుతున్నాయని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అపూర్వ చంద్ర ఈ సందర్భంగా లేఖలో పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాలలోని ఆరోగ్య శాఖ అధికారులు, విపత్తు నిర్వహణ అధికారులు తమ పరిధిలోని ఆస్పత్రులు అగ్నిప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టేలా పనిచేయాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అభ్యర్థించింది. అగ్నిమాపక పరికరాలు, హైడ్రెంట్లు, అలారంలు వంటి అగ్నిమాపక పరికరాలను ఆసుపత్రుల్లో క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని పేర్కొంది.

---------------------------

ఉద్యోగ భవిష్య నిధి – ఈపీఎఫ్ చందాదారుల ఖాతాల్లో తల్లి, తండ్రి పేరు, బంధుత్వంలో దొర్లిన పొరపాట్లను సరిచేసేందుకు సమర్పించాల్సిన ఆధారాల్లో స్వల్పమార్పులు చేసింది. గతంలో పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, హెల్త్‌కార్డు, పింఛనుకార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్ వీటిలో ఏదేని రెండు లేదా

మూడు పత్రాలు జత చేయాలని సూచించింది. తాజాగా వీటికి అదనంగా పాన్‌కార్డు, పదోతరగతి సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఈపీఎఫ్‌వో ఓ ప్రకటనలో తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పలు నియోజకవర్గాలకు చెందిన 51 మందిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 10ఏ ప్రకారం వీరిని అనర్హులుగా పేర్కొంది. వీరిలో ఎక్కువ మంది గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా, చిన్నచిన్న రాజకీయ పార్టీల తరపున పోటీ చేశారు. నిబంధనలు పాటించకపోవటం, ఎన్నికల వ్యయం వివరాలు సమర్పించకపోవడం వంటి కారణాల రీత్యా వీరిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించింది. ఈ జాబితాను ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారులకు పంపించింది.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రేపు, ఎల్లుండి చిత్తూరు జిల్లాలోని కుప్పంలో పర్యటించనున్నారు. రేపు మధ్యాహ్నం బెంగళూరు నుంచి కుప్పంకు చేరుకోనున్న ఆయన మధ్యాహ్నం ఆ పార్టీ కార్యకర్తలతో సమావేశమౌతారు. అలాగే రేపు సాయంకాలం కుప్పం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగే బహిరంగ సభలో చంద్రబాబునాయుడు పాల్గొంటారు. ఎల్లుండి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారు

---------------------------

భారత్, అమెరికా దేశాల సైనిక సంబంధాలు బలోపేతమయ్యేలా బంగాళాఖాతంలో విశాఖపట్నం కేంద్రంగా 'టైగర్ ట్రయంప్' ప్రత్యేక సాగర విన్యాసాలు జరుగుతున్నాయని నేవీ అధికారులు నిన్న ఓ ప్రకటనలో తెలిపారు. రెండు వారాలపాటు జరగనున్న ఈ విన్యాసాల కోసం బాహుబలి నౌకగా పేరొందిన 'యూఎస్ సోమర్సెట్' విశాఖ తీరానికి చేరుకుంది. ఇది ఉభయచర యుద్ధ నౌకగా ఖ్యాతిగాంచింది. దాదాపు 25 భారీ యుద్ధ ట్యాంకులు, నాలుగు యుద్ధ హెలికాప్టర్లు, నౌకకు అన్ని వైపులా ఆయుధ ట్యాంకులు, వెయ్యి మంది సిబ్బంది ఇందులో ఉండటం విశేషం. 2001 సెప్టెంబరు 11వ తేదీన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదులు చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన 93 మంది స్మారకంగా ఈ నౌకను నిర్మించారు. విపత్తుల సమయంలో రక్షణ దళాలు ఈ నౌకను ఆసుపత్రిగా తీర్చిదిద్దిన కారణంగా అత్యాధునిక యుద్ధనౌకలలో ఒకటిగా ఇది చరిత్రలో నిలిచిపోయిందని నేవీ వర్గాలు వివరించాయి.

---------------------------

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా 85 ఏళ్లు పైబడినవారు, 40శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తీసుకువచ్చి పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఫారం 12డి ని రిటర్నింగ్ అధికారికిగానీ, సహాయ రిటర్నింగ్ అధికారికిగానీ పంపించాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలి. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అందుబాటులో ఉంది.

---------------------------

క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా పలు అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ప్రపంచ క్షయ నివారణ దినాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలోని రుయా ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీని చేపట్టారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.... క్షయ వ్యాధికి చికిత్స ఉందని, రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ కేంద్రంలో సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు.

---------------------------

దేశంలో ప్రతి ఏడాది లక్ష మంది ప్రజలలో సుమారు 200 నుండి 215 మంది క్షయవ్యాధికి గురి అవుతున్నారని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. క్షయ వ్యాధి మరణాలు నియంత్రించేందుకు ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. జిల్లాలో 43 డిజిగ్నేటేడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, 7 టిబి యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, జనవరి 2024 నుండి ఇప్పటివరకు 230 మందిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా చిత్తూరులోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఈ రోజు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ... 2025వ సంవత్సరానికి క్షయవ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా అందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య పరీక్షలు చేయించుకుని సకాలంలో మందులు వాడితే ఆ వ్యాధి నుండి రక్షణ పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

బీమా పాలసీలను కొనుగోలు చేయడం, విక్రయించడం, సేవలు అందించడంతో పాటు సమస్యలను పరిష్కరించడం కోసం ఆన్‌లైన్ బీమా మార్కెట్ ప్లేస్ అయిన బీమా సుగమ్ ఏర్పాటుకు భారతీయ బీమా అభివృద్ధి, నియంత్రణ ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ ఆమోదం తెలిపింది. 2047 నాటికి అందరికీ బీమా అనే లక్ష్యంతో బీమా సుగమ్ తీసుకొస్తున్నట్లు పేర్కొంది. ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లా పనిచేసే బీమా సుగమ్‌లో బీమా కంపెనీలు తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చు. జీవిత, జీవితేతర బీమా సంస్థలన్నీ ఇందులో నమోదవుతాయి.

---------------------------

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల తెప్పోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ రోజు శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామివారు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు. అంతకు ముందు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి స్వామివారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఈరోజు సాయంత్రంతో తెప్పోత్సవాలు ముగుస్తాయి.

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలో రాబోయే సార్వత్రిక ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ కే. మాధవీలత నిన్న ఒక ప్రకటనలో తెలిపారు.

రాజకీయ పార్టీలు అందచేసే అభ్యర్థన మేరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, కలెక్టరేట్‌లో పలు విభాగాలను ఏర్పాటుచేసి ఆయా విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులని నియమించామని చెప్పారు.

----------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు తిరుపతి జిల్లాలో కవాతు నిర్వహించాయి. అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం తిరుపతి నగరంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్యవంతులను చేయడానికి కేంద్ర సాయుధ బలగాలు కవాతును నిర్వహించాయి. ఎం.ఆర్.పల్లి సర్కిల్ నుంచి వైకుంఠంపురం ఆర్చ్, గాంధీపురం మీదుగా కవాతు జరిగింది. ఈ సందర్భంగా అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

----------------------------

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి. ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఓటర్లకు నమూనా ఈవిఎంల పై ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

=====================